క్లుప్తంగా

ఎన్నికల ప్రచారం నేడు

పద్మనాభం : మండలంలోని మూడు పంచాయతీల్లో శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు చెప్పారు. వెంకటాపురం, రేవిడి, పాండ్రంగి పంచాయతీల్లో ప్రచారం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా సామగ్రితో విద్యార్థులు, తదితరులు

ఆనందపురం: క్రీడలు ఆడడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని లేడీస్ సర్కిల్ ఇండియా టీమ్ ఏరియా చైర్‌పర్సన్ శాంతి అన్నారు. మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రూ.20 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే విద్యాభివృద్ధి జరగాలన్నారు. హెచ్‌ఎం ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి శారీరక, మానసిక వికాసం అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు లేడీస్ సర్కిల్ ఇండియా టీమ్ క్రీడా సామగ్రి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్వీతి జోషి, మంచుకొండ నీలిమ, అలిక రాజ్‌పుట్, అభిగ్నయ గ్రాంధీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు

తగరపువలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిట్టివలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు.

అనిట్స్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల విద్యార్థులు

తగరపువలస : ఇటీవల డాక్టర్ వైఎస్సార్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని మెడికల్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో టెన్నిస్, త్రోబాల్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులను డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ నరేష్, ఏవో శివప్రసాద్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు వీరిని అభినందించారు. మిగిలిన విద్యార్థులకు వీరు మార్గదర్శకులు కావాలన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పీఎం పాలెం: తన భర్త అదృశ్యమయ్యాడని ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... కొమ్మాది పద్మావతి నిలయంలో నివసిస్తున్న చిటికెల గోవింద్ గతంలో రియల్ ఎస్టేట్ రంగంలో వుండేవాడు. కొన్ని నెలలుగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14న రాత్రి 10 గంటలకు కంపెనీ పనిమీద ఢిల్లీ వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లేదు. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో వుంది. కంపెనీ యాజమాన్యం కూడా సరైన సమాధానం చెప్పడం లేదని గోవింద్ భార్య కనకమహాలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెస్టారెంట్‌లో మంటలు

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని వేంకటేశ్వరమెట్టపై శుక్రవారం రాత్రి శ్రీవసంత రెస్టారెంట్‌ను మంటలు కమ్ముకున్నాయి. ప్రమాదానికి కారణాలు తెలియకపోయినా చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేస్తున్నారు. రెస్టారెంట్ పక్కనే ఉన్న స్వీట్స్ అండ్ బేకరీకి కూడా మంటలు వ్యాపించినట్టు తెలిసింది. రెస్టారెంట్‌లోని నాలుగు గుడిసెలు మండుతుండటంతో ఈ ప్రాంతంలో దట్టమైన పొగతో చీకట్లు అలుముకున్నాయి.

సీఎం జగన్ పాలనలోనే ప్రజలందరికీ మేలు



రొట్టెల వీధి ప్రాంతంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎన్ని కుట్రలు పన్నినా జగన్‌తోనే జనం
- గంటా మాటలు, హామీలు నియోజకవర్గంలో ఎవరూ నమ్మరు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే ప్రజలందరికీ మేలు జరిగిందని... రాష్ట్రానికి, ప్రజలకు మరింత మేలు జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డు పరిధి రొట్టెల వీధి, గెడ్డవీధి, భరత్ కొట్టు జంక్షన్, సీబీఎం ఉన్నత పాఠశాల రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటికే సంక్షేమ పాలన అందించామన్నారు. ఎవరూ, ఎప్పుడూ ఊహించని రీతిలో కోట్లాది రూపాయలతో భీమిలి



భరత్ కొట్టు జంక్షన్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. గత ఐదేళ్లూ ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యలు పరిష్కరించానన్నారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గతంలో గెలిచి ఎవరికీ ముఖం చూపలేదని... ఇప్పుడు కూడా అతన్ని గెలిపిస్తే ఎవరికీ కనిపించకుండా పోతారన్నారు. ప్రజలకు ఎవరు అందుబాటులో వున్నారో గుర్తించాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు మైలిపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి కొండబాబు, బాకి రమణారెడ్డి, ఆర్.ప్రభాకర్‌నాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు, వాసుపల్లి ఎల్లాజీ, ఎర్నింటి అచ్చిబాబు, పాసి స్వర్ణలత పాల్గొన్నారు.

గంటా గ్రాఫ్ డౌన్!

- తేటతెల్లం చేసిన నామినేషన్ ర్యాలీ
- పార్టీ నాయకులకు గంటా చీవాట్లు పెట్టినట్లు వాట్సాప్‌లో చక్కర్లు

తగరపువలస: ఎన్నికల వేళ తప్ప.. మిగిలిన సందర్భాల్లో ప్రజలకు అందుబాటులో ఉండని టీడీపీ భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గ్రాఫ్ అమాంతం పడిపోయింది. గురువారం జరిగిన గంటా నామినేషన్ ర్యాలీ చూసిన వాళ్లంటున్న మాట ఇది. ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు సైతం అంగీకరిస్తున్నాయి. 2014లో భీమిలి నుంచి, 2019లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా గంటా నామినేషన్లు దాఖలు చేసినప్పుడు గట్టిగానే బల ప్రదర్శన చేశారు. సుమారు 20 వేల మంది వరకు జనాలను సమీకరించారు. గురువారం భీమిలిలో జరిగిన నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ, జనసేన కలిసి వచ్చినా జనాలు రాకపోవడం వారిని కలవరపరుస్తోంది. దీనిపై గంటా శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలు, నాయకులను చీవాట్లు పెట్టినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. 50 వేల మందికి తీసుకురమ్మని మనిషికి రూ.400 వంతున ఇస్తే నామినేషన్ ర్యాలీలో 5 వేల మంది కూడా లేరని, నన్ను అవమానించడానికా? భీమిలి రమ్మన్నారంటూ అసహనం వ్యక్తం చేసినట్టు చక్కర్లు కొడుతోంది. దీనిపై స్పందించిన కొందరు నాయకులు 2014 ఎన్నికల తర్వాత టీడీపీ క్యాడర్‌ను కార్యాలయంలోనికి రానివ్వలేదు. ఇప్పుడు సిగ్గు లేకుండా ఎలా వస్తామంటూ చురకలు అంటిస్తున్నారు. ఒకరిద్దరికి తప్ప కార్యకర్తలు, నాయకులకు కష్టం వచ్చినా గంటా తమకు భరోసా ఇచ్చిన సందర్భాలు లేవని దెప్పి పొడుస్తున్నారు. ఎన్నికలు వచ్చాయి కాబట్టి ఆయన డబ్బులు పట్టుకుని వస్తే.. మేము తోకాడించుకుని వెళ్లాలా? ఆ రోజులు పోయాయని తమలో దాగున్న అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. 2014 - 2019 కాలంలో భీమిలిలో మూట కట్టుకున్న అప్రతిష్ట కారణంగా కార్యకర్తలకు మాట మాత్రమైనా చెప్పకుండా ఉత్తర నియోజకవర్గం వైపు దారి చూసుకున్నారని.. అక్కడి నుంచి తరిమేయడంతో మళ్లీ భీమిలి వచ్చారని.. ఇతను మా నాయకుడు అని చెప్పుకోవడానికి కూడా సిగ్గుగా ఉందని వాపోతున్నారు. టీడీపీకే చెందిన బతకనేర్చిన కొందరు వ్యాపారులు, భూకబ్జాదారులు ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ పంచన చేరి లబ్ధి పొందారని, అలాంటి వారే మళ్లీ గంటా పక్కన చేరారని ఆరోపిస్తున్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఓటేయండి



గొట్టిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, కోలా గురువులు, తదితరులు



ఆనందపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని చందక, గొట్టిపల్లి, కుసులవాడలో శుక్రవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి లేకుండా ఇంటింటికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఎన్నికల తర్వాత ప్రజలకు కనిపించని అభ్యర్థులు మళ్లీ పోటీకి వస్తున్నారన్నారు. అలాంటి వారికి ఓటు వేస్తే మన భవిష్యత్ మనమే నాశనం చేసుకున్నట్టు అవుతుందన్నారు.

మరింతగా నియోజకవర్గం అభివృద్ధి

విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌పైనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి వుందన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే, పిల్లల భవిష్యత్ మెరుగుపడాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. మా ఇద్దరి గెలుపుతో భీమిలి నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. భీమిలి ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకొస్తామని చెప్పారు. టీడీపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడి నిధులు తెస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎన్నికల పరిశీలకుడు పి.బాలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు బంక శ్రీను, మహంతి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వి.అప్పలనాయుడు, టి.లక్ష్మి, డి.కనకరాజు పాల్గొన్నారు.

- ఆనందపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంటా నామినేషన్‌తో గ్రామాల్లో సిగపట్లు

తగరపువలస: కూటమి భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం దాఖలు చేసిన నామినేషన్‌కు వస్తే రూ.400 ఇస్తామని ఆశపెట్టిన నాయకులు ఇప్పుడు మొండి చేయి చూపారు. దీంతో గ్రామాల్లో స్థానికుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. నాయకుల తరఫున అందరినీ కూడగట్టి తీసుకెళ్లిన నిర్వాహకుల ఇంటి మీదకు జనం వస్తుండటంతో సర్దిచెప్పలేక సతమతమవుతున్నారు. భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన కుమారి అనే మహిళ ద్వారా శ్రీధర్, రాజు అనే జనసేన నాయకులు 110 మంది మహిళలను 8 ఆటోల్లో తరలించారు. ఒక్కొక్కరికి రూ.300, ఆటోకు రూ.వెయ్యి వంతున ఇస్తామని నమ్మబలికారు. మొత్తం రూ.41,000 కాగా గురువారం సాయంత్రం రూ.20 వేలు పట్టుకుని వచ్చి టీడీపీ నాయకులు ఇంతే ఇచ్చారు... సర్దుకుపోవాలని చెప్పగా రేఖవానిపాలెం గ్రామస్తులు వ్యతిరేకించారు. ఇస్తే మొత్తం ఇవ్వాలని, లేదంటే రూ.20 వేలు పట్టుకుపోవాలని శ్రీధర్, రాజులను నిలదీశారు. శుక్రవారం వరకు డబ్బులు చేతికి రాకపోవడంతో గ్రామస్తులు తన ఇంటి మీదకు తగాదాకు వస్తున్నారని కుమారి వాపోయింది. తనకు న్యాయం చేయాలని టీడీపీ, జనసేన నాయకులను వేడుకుంటున్నా తమకు సంబంధం లేదని అంటున్నారు. జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో కూడా తీసుకెళ్లిన అందరికీ కాకుండా కొందరికే డబ్బులు పంపిణీ చేశారని వాపోతున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంచి ఫుడ్ ప్యాకెట్లు కూడా ఇవ్వకుండా వట్టి చేతులతో పంపించేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీరంటే మీరే డబ్బులు ఇవ్వలేదని టీడీపీ, జనసేన నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకోవడం కూటమిలో అనైక్యతను బహిర్గతం చేస్తోంది.

ముత్తంశెట్టికి మత్స్యకారుల మద్దతు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మద్దతు ప్రకటిస్తున్న మత్స్యకారులతో కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట వేసిన వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు తమ మద్దతు అంటూ శుక్రవారం సాయంత్రం మంగమారిపేట మత్స్యకారులు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారుల మనుగడ, జీవన విధానంలో పెను మార్పులు వచ్చాయని, సమాజంలో గౌరవంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్నామని... అందుకే ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబుతో ప్రత్యేకంగా సమావేశమై 24న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మద్దతు తెలిపేందుకు నామినేషన్‌కు భారీ స్థాయిలో మత్స్యకారులు రానున్నట్లు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్లు

తగరపువలస: భీమిలి అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థులుగా మధురవాడకు చెందిన నాగోతు నాగమణి, పద్మనాభం గ్రామానికి చెందిన బుగత రాము శుక్రవారం వేర్వేరుగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. భీమిలిలోని ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని వీరు తమ అనుచరులతో కలిసి వీటిని సమర్పించారు.



భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి నాగోతు నాగమణి

స్మార్ట్ కంప్యూటింగ్‌పై సదస్సు ప్రారంభం

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో స్మార్ట్ కంప్యూటింగ్‌పై రెండు రోజులపాటు జరగనున్న 6వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సీఎస్‌ఈ, ఐటీ, సీఎస్‌ఎం, సీఎస్‌డీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ అధ్యక్షత వహించారు. హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు సిబాకుమార్, సురేష్‌చంద్ర శతపతి, ఏ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సదస్సు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న సదస్సులో 90 మందికి పైగా పరిశోధకులు సమర్పించిన పరిశోధనా విషయాలను ఆన్‌లైన్‌లో సమర్పించనున్నారు. సదస్సు అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, హెచ్‌వోడీలు దీప్తి, రేఖ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సిబాకుమార్

పార్టీలు మారే వారికి ప్రజలే బుద్ధి చెబుతారు



నమ్మివానిపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: స్వార్థ ప్రయోజనాలతో తరచూ పార్టీలు మారేవారికి ప్రజలే బుద్ధి చెబుతారని జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం సాయంత్రం నమ్మివానిపేట, నమ్మివానిపేట కాలనీ, కర్రి నమ్మివానిపేటలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలలో యాదవులంటే ఎనలేని అభిమానమన్నారు. అందుకే జిల్లాలో మేయర్, వీఎంఆర్డీఏ చైర్మన్, ఎమ్మెల్సీ, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డీసీసీబీ వైస్ చైర్మన్ వంటి ఉన్నత పదవులు ఇచ్చారన్నారు. కొందరు వాటిని సద్వినియోగం చేసుకోగా... మరిందరు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. స్థాయిని మించి పదవులు ఇస్తే నిలుపుకోలేని వారు ఇప్పుడు ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధితో సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు అండగా నిలవగా ఎవరో ఒకరిద్దరు పార్టీని వీడినంత మాత్రాన ప్రజలెవరూ వారితో వెళ్లరని గుర్తించుకోవాలన్నారు. భీమిలితోపాటు రాష్ట్రంలో టీడీపీకి ప్రజలు సమాధి కట్టబోతున్న తరుణంలో కొత్త బిచ్చగాళ్లు తయారయ్యారని ఎద్దేవా చేశారు. ప్రచారంలో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడారు. వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నమ్మి మాధవరావు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నమ్మి శ్రీరామ్, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కరగాని అప్పలరాజు, తెడ్లాపు అప్పలరాజు, జీరు వేణుగోపాలరెడ్డి, నమ్మి సింహాచలం, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల ప్రమీల, కొయ్య దినేష్, చిల్ల సూరినరసయ్యరెడ్డి, పీతల రాజారావు, సరగడ నాగిరెడ్డి, నమ్మి సురేష్, నమ్మి వెంకట గంగులు, జీరు భరత్‌రెడ్డి, మునకాల ఆదినారాయణ, చిల్ల రంగారెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

భీమునిపట్నం: భీమిలిలోని శివ కేశవ స్వామి ఆలయ ఆవరణలో ఉన్న వేణుగోపాల స్వామి కల్యాణం శుక్రవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.శింగరాచార్యులు ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా తీర్థ ప్రసాదాలు అందించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుడిలో టీడీపీ జెండాలతో ప్రచారం

గంటా బ్యాచ్ అత్యుత్సాహం

కొమ్మాది: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ 5వ వార్డులో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా సాయిరాం కాలనీలో శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో పూజలో పాల్గొన్నారు. అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు, టోపీలు, కండువాలతో గుడిలోకి వెళ్లి జై గంటా, జైజై గంటా అంటూ నినదించడంతో భక్తులు ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. అమ్మవారి సన్నిధిలో ప్రచారం నిర్వహించడంపై భక్తులు ఆందోళన చెందారు. అక్కడితో ఆగకుండా ఆలయ ప్రాంగణంలో గంటా శ్రీనివాసరావును గజమాలతో సత్కరించడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. ప్రచారంలో పార్టీ సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారు ఆగ్రహంతో వున్నారు. టీడీపీలో ఓ వర్గానికి గంటా శ్రీనివాసరావు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, రెండు రోజుల్లో తాడోపేడో తేల్చుకోవాలని పలువురు సీనియర్ నాయకులు అంటున్నారు.

మరోవైపు 5వ వార్డులో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబును గంటా కనీసం ప్రచార రథంపైకి పిలవకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. ఈ ప్రచారానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, జనసేన 5వ వార్డు మాజీ అధ్యక్షుడు యడ్ల గణేష్, ఆయన అనుచరులు దూరంగా ఉన్నారు.

కారులో గంటా... ఎండలో కార్యకర్తలు

ప్రచారం శుక్రవారం ఉదయం 9 గంటలకు అని చెప్పి 11 గంటలకు గంటా రావడంతో కార్యకర్తలు, నాయకులు మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ప్రచారానికి వచ్చిన గంటా శ్రీనివాసరావు ఎక్కువ సమయం కారులోనే వుండిపోయారు. సాయిరాం కాలనీలో ప్రచారం ప్రారంభించి 5వ వార్డు అంతా ప్రచార రథంపైనే గంటాతో పాటు ర్యాలీగా వెళ్లాలనేది నాయకుల షెడ్యూల్. అయితే ఇందుకు భిన్నంగా గంటా మాత్రం అక్కడక్కడ ప్రచార రథం పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేసి వెనువెంటనే కారులోకి వెళ్లిపోయారు. ఆయన విశ్రాంతి తీసుకునేందుకు క్యారీవ్యాన్ ఏర్పాటు చేశారు. ప్రజల్లో లేని మనిషి గెలిస్తే ప్రజలకు ఏం చేస్తాడని ఇక్కడకు వచ్చిన వారంతా గుసగుసలాడుకున్నారు. గంటా బిల్డప్ చూసిన స్థానిక ప్రజలు ఈయన ఎమ్మెల్యేగా గెలిస్తే సామాన్యుల సమస్యలు తీరడం కష్టమని అంటున్నారు.



గుడిలో టీడీపీ జెండాలతో ఆ పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీకే అన్ని వర్గాల మద్దతు

విస్తృతంగా పార్టీ శ్రేణుల ప్రచారం

మధురవాడ: ప్రజలకు నిత్యం అందుబాటులో వుండడంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచేందుకు... ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా వున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 5, 7 వార్డుల్లో నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని అయ్యప్పనగర్, స్వయంకృషినగర్ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. నాయకులు పోతిన సురేష్ కుమార్, ఎస్.బాబ్జి, జేఎస్ రెడ్డి, కూన రమణ, బందారు శివలక్ష్మి, సూకవరపు గౌతమి, సుధాకర్, తేజ, గురుగుబిల్లి రంగ, బోయి సుజాత, చింతాడ రామలక్ష్మి, రుషికేష్, ఉగ్గిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీ, శ్యాంనగర్, డాక్‌యార్డ్ కాలనీ, బాపూజీనగర్ పరిసర ప్రాంతాల్లో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు బంగారు ప్రకాశ్, పిల్లా కృష్ణమమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, వంకాయల మారుతీప్రసాద్, జగ్గపిల్లి నరేష్, కుడితి రామారావు, వట్టికుల నాగమ్మ, నెంబర్ రమణమ్మ, చేకూరి రజని, కె.శ్రీదేవి, తమ్మినేని వరలక్ష్మి, బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి గెలుపే ధ్యేయంగా జీవీఎంసీ 6వ వార్డులో ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్సీ కాలనీ, దేవిమెట్ట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు గాదె రోశిరెడ్డి, బొట్టా అప్పలరాజు, సియాద్రి కనకరాజు, పిల్లా రమణ, పోతిన సూరిబాబు, తాతారావు, అవతార్ సింగ్, ఈశ్వరరావు, ప్రసాద్, ఎల్లాజీ, వెంకట అప్పారావు, వరలక్ష్మి, మంగవేణి, అనూష, శివ, అప్పారావు, సియాద్రి పైడిరాజు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట, నమ్మివారి కళ్లాల్లో శుక్రవారం రాత్రి వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదిరాయణ, ఈర్ల ఈశ్వరరావు ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించారు. అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు.



శివశక్తినగర్ రోడ్డు అయ్యప్పనగర్‌లో ప్రచారంలో పోతిన హనుమంతురావు, తదితరులు



7వ వార్డు టైలర్స్ కాలనీలో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు



జీవీఎంసీ 6వ వార్డు ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నమ్మివారి కళ్లాల్లో కరపత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఆదినారాయణ